క్లుప్తంగా

నేడు బీఆర్‌ఎస్ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశం

మోతీనగర్: గాయత్రినగర్ చంద్రాగార్డెన్స్‌లో మంగళవారం ఉదయం 10గంటలకు బీఆర్‌ఎస్ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సబిహా బేగం, మేడ్చల్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్‌లు ముఖ్యఅతిథులుగా హాజరు కానున్నారు. ఈ సమావేశానికి అన్ని బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, స్థాన కార్యదర్శులు, సీనియర్ నాయకులు, ఏరియా సభ్యులు, బస్తీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, మహిళలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అశోక్ చక్రవర్తికి డాక్టరేట్



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి వివేకానందనగర్ కాలనీలోని టైకా మార్షల్ అకాడమీ ఫౌండర్ అండ్ చైర్మన్ అశోక్ చక్రవర్తి డాక్టరేట్ అందుకున్నారు. పాండిచ్చేరికి చెందిన గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ వారి ఆధ్వర్యంలో జరిగిన అవార్డుల కార్యక్రమంలో మార్షల్ ఆర్ట్స్‌లో అశోక్ చక్రవర్తికి గౌరవ డాక్టరేట్ అందజేశారు.

బీహెచ్‌ఈఎల్ హౌసింగ్ సొసైటీ నూతన కార్యవర్గం

శేరిలింగంపల్లి: బీహెచ్‌ఈఎల్ ఎంఐజీ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా సోమవారం ఎన్నుకున్నారు. ఈ నెల 28వ తేదీన జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన మేనేజింగ్ కమిటీ సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పి.వెంకట్రావ్, ఉపాధ్యక్షులుగా ఎస్.నారాయణ, కార్యదర్శిగా కెవీ.సుబ్బారావు, కోశాధికారిగా ఎం.నీలకంఠరావు, మేనేజింగ్ కమిటీ సభ్యులుగా చింత రాములు, సి.విద్యాధరిలు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను కాలనీ వాసులు సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

సీపీఈయూ కార్యదర్శి కారు ధ్వంసం

బంజారాహిల్స్: అర్ధరాత్రి తన ఇంటి వద్దకు వచ్చి రాళ్లతో కారు అద్దాలను ధ్వంసం చేయడమే కాకుండా తనకు హెచ్చరికలు జారీ చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ తెలుగు సినీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్ యూనియన్ (సీపీఈయూ) సెక్రటరీ కాట్రగడ్డ సుధాకర్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలివీ... బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని కమలాపురి కాలనీలో నివసించే కాట్రగడ్డ సుధాకర్ ఇంటికి అదే యూనియన్‌లో గతంలో ఉపాధ్యక్షుడిగా పని చేసిన ఆర్టిస్టుల మేనేజర్ జి.హరినాథ్ అర్ధరాత్రి ఒంటి గంటకు వచ్చాడు. ఆ సమయంలో సుధాకర్ నిద్రపోతున్నాడు. మద్యం మత్తులో తీవ్ర ఆగ్రహంతో ఊగిపోతున్న హరినాథ్ అక్కడే ఒక సెల్ఫీ వీడియో తీసుకొని సుధాకర్‌కు హెచ్చరికలు జారీ చేశాడు. అంతు చూస్తానని బెదిరించాడు. దమ్ముంటే రా అంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. అంతే కాకుండా అక్కడే ఉన్న రెండు రాళ్లు తీసుకొని సుధాకర్ కారు అద్దాలను ధ్వంసం చేశాడు. ఇటీవల ఎన్నికల్లో తనపై పోటీ చేసి ఓడిపోయినప్పటి నుంచి కక్షపెంచుకున్నాడని ఆయన నుంచి తనకు ప్రాణహాని ఉందంటూ సుధాకర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బీ కేర్‌ఫుల్

నామినేషన్ పత్రాల దాఖలులో జాగ్రత్త అవసరం

- నవంబర్ 3 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం
- అభ్యర్థులు ఆర్‌ఓకు సమర్పించే పత్రాలే కీలకం
- జనరల్ అభ్యర్థులు రూ.10వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5 వేల డిపాజిట్ చేయాలి
- ఆర్‌ఓ వద్దకు అభ్యర్థితోపాటు నలుగురికి మాత్రమే అవకాశం



సాక్షి, మేడ్చల్ జిల్లా: అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా నవంబర్ 3 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండటంతో.. నామినేషన్ల దాఖలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాజకీయ పార్టీల అభ్యర్థులకు ఎన్నికల సంఘం పలు సూచనలు చేస్తోంది. వీటిని ఖచ్చితంగా పరిగణనలోని తీసుకోవాల్సిందని పేర్కొంటుంది. ఈ నేపథ్యంలోనే నామినేషన్ దాఖలు చేసే సమయంలో అభ్యర్థులు సమర్పించనున్న పత్రాలకు అత్యంత ప్రాధాన్యం ఉంటుంది. ఏ-ఫాం, బీ- ఫాం, అఫిడవిట్ తదితర అంశాల ప్రాముఖ్యతను అభ్యర్థులు పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుందని ఎన్నికల సంఘం పేర్కొంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ పత్రాలను దాఖలు చేసే అభ్యర్థిని ప్రతిపాదించే వ్యక్తి సంబంధిత నియోజకవర్గంలో ఓటరై ఉండాలి. గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్రస్థాయి పార్టీలకు చెందిన అభ్యర్థిని అతను పోటీ చేస్తున్న నియోజకవర్గ పరిధిలోని ఓటరు ప్రతిపాదించాల్సింటుంది. స్వతంత్ర, గుర్తింపు లేని పార్టీల అభ్యర్థులను మాత్రం పది మంది ఓటర్లు ప్రతిపాదించాల్సి ఉంటుంది. ప్రతిపాదించే వారు తన ఓటరు జాబితా వివరాలను కూడా సమర్పించాల్సి ఉంటుంది.

◆ అభ్యర్థి నేరుగా లేదా తనను ప్రతిపాదించే వ్యక్తి నామినేషన్ పత్రాలను దాఖలు చేసేందుకు అవకాశముంది. అసెంబ్లీ నియోజకవర్గ స్థానంలో నామినేషన్ దాఖలుకు అభ్యర్థి వయస్సు 25 ఏళ్లు నిండి ఉండాలి. తెలంగాణ రాష్ట్ర పరిధిలోని ఏదైనా అసెంబ్లీ నియోజకవర్గంలో బరిలో నిలిచే అభ్యర్థికి ఖచ్చితంగా ఓటు హక్కు కలిగి ఉండాలి. నామినేషన్ పత్రాలు దాఖలు చేసే సమయంలో అభ్యర్థితో పాటు నలుగురి వ్యక్తులను మాత్రమే రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి అనుమతిస్తారు. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా జనరల్ స్థానంలో పోటీచేసే అభ్యర్థి రూ.10వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే రూ.5 వేలు డిపాజిట్(ధరావతు) చెల్లించాల్సి ఉంటుంది. ఈ డిపాజిట్ సొమ్మును బ్యాంకు చలానా రూపంలో చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రాన్ని నామినేషన్ పత్రంతో జత చేయాలి. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థి ప్రత్యేకంగా బ్యాంకు ఖాతా తెరవాల్సి ఉంటుంది. ఈ బ్యాంకు ఖాతా ద్వారానే ఎన్నికల ఖర్చుల లావాదేవీలు నిర్వహించాల్సి ఉంది. బ్యాంకు ఖాతా వివరాలను నామినేషన్ పత్రంలో తప్పని సరిగా పేర్కొనాలి. అభ్యర్థి పది పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను నామినేషన్ పత్రంతో జతపరచాలి. నామినేషన్ పత్రాల దాఖలు సమయంలో రిటర్నింగ్ అధికారి ఎదుట అభ్యర్థి ప్రతిజ్ఞ చేయాల్సింటుంది. గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్రస్థాయి పార్టీల అభ్యర్థులు తమ నామినేషన్ పత్రంతో పాటు పార్టీ జారీ చేసిన ఏ-ఫాం, బీ-ఫాం పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది.

బీ-ఫాం అంటే..

పార్టీ తరఫున ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేసే పత్రమిది. తమ పార్టీ నుంచి ఫలానా వ్యక్తి పోటీ చేస్తున్నారని, పార్టీ గుర్తు కేటాయించాలని అభ్యర్థించటమే ఈ బీ-ఫాం పత్రం ముఖ్యోద్దేశం.

ఏ ఫాం అంటే..

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థిని ధ్రువీకరించేందుకు జాతీయ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్రస్థాయిలో ఒకరికి అధికారం అప్పగిస్తారు. అభ్యర్థికి సదరు వ్యక్తి బీ- ఫాం జారీ చేస్తారు. రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందిన పార్టీ అధ్యక్షుడు తాను లేదా మరొకరికి, లేదా జిల్లాస్థాయిలో ఒకరికి బీ-ఫాం జారీచేసే అధికారాన్ని అప్పగిస్తుందని ఏ- ఫాం సూచిస్తోంది. ఏ- ఫాం ద్వారా అధికారం పొందిన వ్యక్తి పోటీచేసే అభ్యర్థికి బీ-ఫాం ఇస్తారు. ఏ-ఫాం, బీ-ఫాం పత్రాలు నామినేషన్ దాఖలు సమయంలో లేదా నామినేషన్ పత్రాల దాఖలు చివరి రోజు మధ్యాహ్నం 3 గంటల్లోగా సంబంధిత రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ)కి అందించాల్సి ఉంటుందని జిల్లా ఎన్నికల సంఘం పేర్కొంటోంది.

అభ్యర్థి తన నేర చరిత్ర, తనపై నమోదైన పోలీసు కేసులు, ఇతరత్రా కోర్టుల్లో విచారణలో ఉన్న కేసుల వివరాలతో సహా తనతోపాటు, భార్య, పిల్లల స్థిర, చరాస్తులు, అప్పులు, బ్యాంకులో డిపాజిట్లు, నగదు నిల్వ వివరాలు వెల్లడిస్తూ అఫిడవిట్ (ప్రమాణ పత్రం) సమర్పించాల్సి ఉంటుంది.

ప్రజా స్పందన చూస్తుంటే లక్ష మెజార్టీ ఖాయం

కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్



ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్

ఓల్డ్‌బోయిన్‌పల్లి: డివిజన్‌లో చేపట్టిన పాదయాత్రలో కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావుకు ప్రజల నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే ఈసారి లక్షకు పైగా మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని ఓల్డ్‌బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. డివిజన్‌లోని హస్మత్‌పేట, హరిజన బస్తీ, లైన్స్‌టౌన్ కాలనీల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. ప్రచారంలో నాయకులు నరేందర్‌గౌడ్, నర్సింగ్‌రావు, నర్సింగ్ రావు, ఇర్ఫాన్, హరినాథ్, కనకరాజు యాదవ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు



ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన దిల్‌కుష్‌నగర్ యూత్ అసోసియేషన్ సభ్యులు

కూకట్‌పల్లి: బాలానగర్ డివిజన్ దిల్‌కుష్‌నగర్ యూత్ అసోసియేషన్ సభ్యులు బీఆర్‌ఎస్‌లో చేరారు. సోమవారం వీరికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కృష్ణారావు నాయకత్వంలో ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలు పరిష్కారం చేశారన్నారు. అందుకు ఉదాహరణ బాలానగర్ ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టడమే అని అన్నారు. ఎమ్మెల్యే కృష్ణారావును అఖండ మెజార్టీతో గెలిపించుకుంటామని పేర్కొన్నారు.

జంగ్ తెలంగాణ 2023

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును గెలిపించాలి

కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ సంగీత్‌నగర్, కొమ్మనిగడ్డ, చాకలిబస్తీ, మంగళిబస్తీ, కుమ్మరి బస్తీ, ముదిరాజ్ బస్తీల్లో సోమవారం కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి పరిచారన్నారు. కారు గుర్తుపై ఓటు వేసి ఆయనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వాసుదేవ రావు, డివిజన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, కూకట్‌పల్లి నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు బొట్టు విష్ణు తదితరులు పాల్గొన్నారు.

బల్గురి రంగారావు సేవలు బీజేపీకి అవసరం



బల్గురి రంగారావును బీజేపీ పార్టీలోకి ఆహ్వానించిన రవికుమార్‌యాదవ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: బీజేపీ పార్టీలో గతంలో క్రియాశీలకంగా పనిచేసి.. కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు బల్గురి రంగారావు దూరంగా ఉంటున్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్‌యాదవ్ సోమవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న ఎన్నికల్లో పార్టీకి రంగారావు సేవలు అవసరమని గుర్తించి బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరవేయడంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పర్వతాలు యాదవ్, నరసింహాచారి, గోపాలరావు, సీతారామరాజు, బాలుయాదవ్, ఆంజనేయులు యాదవ్, సందీప్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ విజయానికి సమష్టిగా పనిచేయాలి

కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్



ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి అరెకపూడి గాంధీని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ సోమవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పాదయాత్ర చేస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ ఫేజ్1, సాయినగర్ ఈస్ట్, వెస్ట్, ఆదిత్యనగర్‌లలో కాలనీ వాసులను ఆప్యాయంగా పలకరిస్తూ కారు గుర్తుకే ఓటు వేయాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాదయాత్రలో ఎక్కడికి వెళ్లినా ప్రజలు ఆప్యాయంగా స్వాగతం పలుకున్నారని సంతోషం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ విజయానికి సమష్టిగా పనిచేసి ఎమ్మెల్యే గాంధీకి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్, డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, గౌరవ అధ్యక్షుడు అనిల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కాశీనాథ్ యాదవ్, రాజేష్‌చంద్ర, ప్రధాన కార్యదర్శి గుడ్ల శ్రీనివాస్, శివరాజ్‌గౌడ్, పాండుగౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, బి.వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌రాజునగర్‌లో ఎమ్మెల్యే కూతురు, కొడుకు ప్రచారం

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఏఎస్‌రాజు నగర్‌లో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి మద్దతుగా సోమవారం ఆయన కుమారుడు పృథ్వీ, కుమార్తె ప్రణీత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శేరిలింగంపల్లి నియోజవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గాంధీకి ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా అరుంధతీయ సేవా మండలి వార్షికోత్సవం



అలయ్ బలయ్ కార్యక్రమంలో అతిథులను సత్కరిస్తున్న నిర్వాహకులు

మోతీనగర్: అరుంధతీయ సేవ మండలి ఆధ్వర్యంలో వార్షికోత్సవం సందర్భంగా దసరా మిలాప్ అలయ్, బలయ్ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సర్వే సత్యనారాయణ విచ్చేశారు. తెలుగు రాష్ట్రాల నుంచి అరంధతీయ బంధువులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ కుమారి జోత్స్న, జూనియర్ సివిల్ జడ్జి కొమ్ము ప్రవీణ్‌కుమార్, హైకోర్టు ప్రభుత్వ న్యాయవాది దాసరి బాలయ్య, తెలంగాణ దళితసేన రాష్ట్ర అధ్యక్షులు గంటా మల్లేష్‌లకు శాలువా, మెమొంటోతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అరంధతీయ బంధు సేవా మండలి రాష్ట్ర అధ్యక్షుడు కేపీ నర్సింగ్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీబీ సత్యేంద్ కృష్ణ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు బి. నర్సింగ్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి డి. పవన్‌కుమార్ పాల్గొన్నారు.

అవగాహనతో స్ట్రోక్‌లను నివారించవచ్చు

బంజారాహిల్స్: ప్రతి సంవత్సరం అక్టోబర్ 29న ప్రపంచ వ్యాప్తంగా వరల్డ్ స్ట్రోక్‌డేను నిర్వహిస్తారు. ఇందులో భాగంగా సోమవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 1లోని విరించి ఆస్పత్రిలో బ్రెయిన్ స్ట్రోక్ దానికి సంబంధించిన పలు అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు డాక్టర్ మహ్మద్ అతీక్ అర్ అహ్మద్, డాక్టర్ సాయి రవిశంకర్, వైస్ చైర్మన్ వేదుల సత్యనారాయణ పాల్గొన్నారు. స్ట్రోక్ వచ్చిన పేషెంట్‌ను వెంటనే గుర్తించి వైద్య భాషలో పేర్కొన్నట్లు గోల్డన్ అవర్ గంటలోపు ఆస్పత్రికి చేరిస్తే ప్రాణాలు కాపాడవచ్చునని అన్నారు. మాంసంకన్నా శాకాహారం తీసుకోవడం ద్వారా స్ట్రోక్‌లను నివారించవచ్చని చీఫ్ డైటీషియన్ అపర్ణ తెలిపారు.

'నిమ్స్ పల్స్' భేష్: డైరెక్టర్ ప్రొఫెసర్ బీరప్ప

సంచాలకులు ప్రొఫెసర్ నగరి బీరప్ప



లక్డీకాపూల్: నిజాం వైద్య విజ్ఞాన సంస్థ(నిమ్స్) పల్స్ భేషుగ్గా ఉందని సంచాలకులు ప్రొఫెసర్ నగరి బీరప్ప పేర్కొన్నారు. సోమవారం ఆయన నిమ్స్ లెర్నింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'నిమ్స్ పల్స్' శీర్షికన త్రైమాసిక పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ... 54 పేజీలతో కూడిన ఈ ప్రతికలో ఆస్పత్రిలోని వివిధ విభాగాలలో రోగులకు అందిస్తున్న అధునాతన సేవలపై సమగ్ర సమాచారాన్ని పొందుపర్చామన్నారు. నిమ్స్‌లో జరుగుతున్న పరిశోధనలు, కాన్ఫరెన్స్‌లు, సీఎంఈలు, పబ్లికేషన్స్, అభివృద్ధి కార్యక్రమాలు, క్రీడా సాంస్కృతిక అంశాలను సైతం నిమ్స్ పల్స్ పత్రికలో వివరించామన్నారు. నిమ్స్ డైరెక్టర్ చీఫ్ ఎడిటర్‌గా వ్యవహరించే ఈ పత్రిక రూపకల్పనలో డీన్ ప్రొఫెసర్ లిజ రాజశేఖర్, మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యనారాయణ, జీవన్‌దాస్ కోఆర్డినేటర్, నిమ్స్ నెఫ్రాలజీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ స్వర్ణలతతో పాటుగా మరో మంది వైద్యనిపుణులు ఎడిటర్లుగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.

ఎల్‌ఐసీ ఏజెంట్లపై కేటీఆర్ వ్యాఖ్యలు బాధాకరం

పంజగుట్ట: ఎల్‌ఐసీ ఏజెంట్లను కించపరిచేలా మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు సరికాదని లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ జనరల్ ఎస్.బి.శ్రీనివాసాచారి అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఉపాధ్యక్షుడు ఎమ్.ఎస్.మూర్తి, కోశాధికారి బి.శ్రీరామ్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ... కరీంనగర్ సభలో మంత్రి అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారన్నారు. వెంటనే ఏజెంట్లకు నష్టం వాటిల్లకుండా ఏదైనా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. మాజీ అధ్యక్షుడు బి.ఎన్.చారి, సింగారపు శ్రీనివాస్, సూరి సీతారాం, ఉదయభాను, కట్ట వెంకట్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

మూసాపేట నుంచి 10వేల ఓట్ల మెజార్టీ ఇవ్వాలి

- మూసాపేటకే ఎక్కువ డబుల్ 'ఇళ్లు'ఇచ్చాం
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మూసాపేట: మూసాపేట గూడ్స్‌షెడ్ రోడ్డులో సోమవారం మూసాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరం కృష్ణారావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రేవంత్‌రెడ్డి గెలిచిన తరువాత నాలుగేళ్లలో ఒక్కసారి కూడా కూకట్‌పల్లికి రాలేదన్నారు. కరోనా సమయంలో పేదప్రజలను ఆదుకున్నామని... ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సంక్షేమం కోసం కృషి చేశామన్నారు. ఇప్పుడు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఏ మొహం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. మూసాపేట గ్రామానికి రేవంత్‌రెడ్డి ఏమి అభివృద్ధి చేశారని ప్రజలే ప్రశ్నించాలన్నారు. మూసాపేటలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తానని మూసాపేట నుంచి 10వేల మెజార్టీ ఇవ్వాలని కోరారు.

◆ **మూసాపేటలో 90 శాతం పనులు పూర్తి చేశాం..**

కొన్ని సంవత్సరాలుగా మూసాపేటలో డ్రైనేజీ, మంచినీరు, విద్యుత్, రోడ్ల సమస్యలు పరిష్కరించామని... ఇక్కడ జరిగిన ప్రతి అభివృద్ధి తానే చేశానని పేర్కొన్నారు. మూసాపేటకే ఎక్కువ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు వచ్చాయని తెలిపారు. బీసీ, దళిత బంధు, సంక్షేమ పథకాలు సైతం అందించామని పేర్కొన్నారు. కమ్యూనిటీహాల్, ఆలయాలు, బడులు కట్టించామని తెలిపారు. మూసాపేటలో 90 శాతం పనులు పూర్తి చేశామని, రేషన్‌కార్డులు, పెన్షన్‌లు రాకపోతే దరఖాస్తు చేసుకున్న వారికి అందిస్తామన్నారు. మూసాపేట చౌరస్తాలో రోడ్డు దాటేందుకు ఇబ్బందిగా ఉంటే ఫుట్ ఓవర్‌బ్రిడ్జి కట్టించామన్నారు.

◆ **పీజేఆర్‌ను ఇబ్బందులు పెట్టడంతోనే చనిపోయారు..**

పీజేఆర్ మాస్ లీడర్ అని.. ఎంతో గొప్ప నాయకుడని ఎమ్మెల్యే అన్నారు. పీజేఆర్ తరువాత ఆ పేరు తనకే వర్తిస్తుందని అన్నారు. అందుకు తనకు ఆనందంగా ఉందన్నారు. పీజేఆర్‌ను సోనియాగాంధీ పెట్టిన బాధలు తట్టుకోలేక ఆయన చనిపోయారన్నారు. ఖైరతాబాద్ టికెట్ ఆయన కొడుకుకు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతోంది కూడా కాంగ్రెస్ పార్టీయే అన్నారు.

◆ **వెన్ను పోటు పొడిచే వారిని దూరం పెడతాం..**

నిజాయితీగా ఉన్న కార్యకర్తలకు అండగా ఉంటామనన్నారు. వెన్ను పోటు పొడిచే వారిని దూరం పెడతామని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ నుంచి చాలా మంది అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌లో చేరడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత తమదేనన్నారు. అభిమానం, ప్రేమ కలిగిన కార్యకర్తలు బీఆర్‌ఎస్ నాయకులు అని కొనియాడారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వమే వస్తుందని... కూకట్‌పల్లిలో తానే గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈసారి గెలిచిన వెంటనే కార్యకర్తలకు, ఉద్యమకారులకు పదవులు ఇప్పించే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జిల్లా గోపాల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.





మూసాపేట గూడ్స్‌షెడ్ రోడ్డులో బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, పాల్గొన్న కార్యకర్తలు తదితరులు

మరోసారి గెలిపించుకుంటాం

మూసాపేట: మూసాపేట బీఆర్‌ఎస్ నాయకుడు చున్నూ పాషా ఆధ్వర్యంలో సోమవారం పార్టీలో సుమారు 150 మంది చేరారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జంగీర్, వాజిద్, అజ్జు, అక్బర్, హఫీజ్ తదిరతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చున్నూ పాషా మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన నాయకుడు కృష్ణారావు అని కొనియాడారు. ఆయనను మరోసారి గెలిపించుకుంటామని అన్నారు.



బండి రమేశ్‌కు ఆదిలోనే కష్టాలు

కొట్లాడుకుంటున్న స్థానిక కాంగ్రెస్ నేతలు

బాలానగర్: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేశ్‌కు ఆదిలోనే కష్టాలు మొదలయ్యాయి. సోమవారం బాలానగర్‌లో పార్టీ ఎన్నికల కార్యాలయం ప్రారంభానికి ముందే ఇద్దరు నాయకులు కొట్టుకున్నారు. తన మీద కోవర్టు అని ముద్ర వేస్తున్నారని సత్యం శ్రీరంగం మరో కాంగ్రెస్ పార్టీ నాయకుడైన మాదిరెడ్డి యుగంధర్‌రెడ్డిని ఉద్దేశించి అనటంతో గొడవకు కారణమైంది.

◆ పార్టీ ఆఫీసు ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫొటోలు సరిగ్గా లేవని కొందరు కార్యకర్తలు గొడవ చేశారు. ఇరువురు నాయకుల మధ్య జరిగిన గొడవ చూసి పార్టీ అభ్యర్థి బండి రమేశ్ చూస్తూ ఉండిపోయారు. అంతేకాకుండా ఫతేనగర్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొందరు ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు. జరిగిన సంఘటనతో కార్యకర్తలు అసహనం వ్యక్తం చేశారు.

◆ బండి రమేశ్ ప్రచారం కంటే ముందు నాయకులను సమన్వయం చేసుకోవటానికి సమయం కేటాయించాల్సిన పరిస్థితి నెలకొంది. పార్టీ కార్యాలయం ప్రారంభానికి ఎంతో ఉత్సాహంగా వచ్చిన కార్యకర్తలు నిరాశతో వెనుదిరిగారు.

అధికారంలోకి వస్తే ప్రతి ఒక్కరికి అండగా నిలుస్తా

కూకట్‌పల్లి కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేశ్



కేపీహెచ్‌బీ డివిజన్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్, నాయకులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మండి రమేశ్ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ సత్యం శ్రీరంగంతో కలిసి సోమవారం కేపీహెచ్‌బీకాలనీలోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద పాదయాత్ర చేపట్టారు. ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను తెలియజేసి హస్తం గుర్తుకు ఓటు వేయమని విజ్ఞప్తి చేశారు. పాదయాత్రలో కాంగ్రెస్ పార్టీ నాయకులకు పూలు, హారతులతో స్వాగతం పలికారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి ఒక్కరికి అండగా నిలుస్తానని బండి రమేశ్ హామీ ఇచ్చారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో బండి రమేశ్ పాదయాత్ర చేపట్టడంతో కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ నాయకుల్లో కొత్త ఉత్సాహం వచ్చింది. అదే విధంగా కేపీహెచ్‌బీ డివిజన్ పరిధిలోని శ్రీల టవర్స్ నుంచి ప్రారంభించిన ఎన్నికల ప్రచారంలో బండి రమేశ్ పాల్గొని కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. ఈ పాదయాత్రలో బీ-బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, కేపీహెచ్‌బీ డివిజన్ అధ్యక్షుడు తమ్మినేని ప్రవీణ్, బాలాజీనగర్ అధ్యక్షుడు కృష్ణ, కేపీహెచ్‌బీ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ అరవింద్ రెడ్డి, కేపీహెచ్‌బీ డివిజన్ వర్కింగ్ వైస్ ప్రెసిడెంట్ అప్పారావు, కేపీహెచ్‌బీ డివిజన్ జనరల్ సెక్రటరీ ఫణికుమార్, కూకట్‌పల్లి నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గజానంద్ శేఖర్, కాంగ్రెస్ పార్టీ అభిమానులు, నాయకులు పాల్గొన్నారు.